సాక్షి
కుమురం భీం
ఆదివారం ❙ 29 ❙ జనవరి ❙ 2023



ముగిసిన బడిబయటి పిల్లల సర్వే

బడిబయటి పిల్లలతోపాటు మధ్యలో బడి మానేసిన పిల్లల సర్వే పూర్తయింది. వారిని మళ్లీ పాఠశాలకు పంపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 9లో▸



'ఉపాధి' బడ్జెట్ రూ.9.98కోట్లు

వాంకిడి మండలంలో ఈ ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ కోసం రూ.9.98కోట్ల అంచనా బడ్జెట్ రూపొందించారు. అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /19.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. చలిప్రభావం చాలా వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మహాసమ్మేళనం విజయవంతం చేయాలి



జీఎంతో పూర్వ విద్యార్థులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న పూర్వవిద్యార్థుల మహాసమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోర్ కమిటీ సభ్యులు కోరారు. శనివారం గోలేటిటౌన్‌షిప్‌లో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్, ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్ గుప్తాను కలిసి మహాసమ్మేళనానికి సంబంధించిన ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1983 నుంచి 2022 వరకు సింగరేణి ఉన్నత పాఠశాలలో చదివిన అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులతో మహాసమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 2వేల మంది పూర్వ విద్యార్థులతో పాటు సుమారు 100మంది పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులతో సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉపేందర్, శ్రీనివాస్, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుమలత, శృతి, సుజాత, ప్రవల్లిక, ధనలక్ష్మి, స్రవంతి తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: మూడు నెలల పెండింగ్ వేతనాలతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లించాలని శనివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బల్దియా మేనేజర్ క్రాంతికి కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ శంకర్, జీ సంజీవ్ మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా పీఎఫ్, ఈఎస్‌ఐకి సంబంధించిన డబ్బులు వేతనం నుంచి కోత విధిస్తూ ఈఎస్‌ఐ, పీఎఫ్ ఖాతాల్లో జమ చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందని వాపోయారు. అలాగే మూడు నెలలుగా ఎన్‌ఎంఆర్, వాటర్ సప్లయ్, ఎలక్ట్రికల్, పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి ఈఎస్‌ఐ, పీఎఫ్ డబ్బులు జమ చేయడంతో పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీరో సర్వీస్ వారిని అనుమతించాలి



నినదిస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పదోన్నతులు, బదిలీలల్లో జీరో సర్వీస్ ఉపాధ్యాయులను అనుమతించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో శనివారం డీఈవో కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. అనంతరం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు మాట్లాడుతూ.. 317జీవో బాధిత ఉపాధ్యాయులకు బదిలీ అవకాశం కల్పించాలని, దొడ్డి దారిన జారీ చేసిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేస్తూ అక్రమ బదిలీలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, యూఎస్‌పీసీ నాయకులు హేమంత్, ఊశన్న, సుభాష్, తిరుపతి, భాగ్యశ్రీ, హరీశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం



దేవుడ్‌పల్లిలో మాట్లాడుతున్న గణేశ్‌రాథోడ్

కెరమెరి: కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారమవుతాయని పీసీసీ సభ్యుడు గణేశ్ రాథోడ్ పేర్కొన్నారు. శనివారం దేవుడ్‌పల్లి, ఇందాపూర్, గోండ్‌గూడ, కెలిబి, కెలికే గ్రామాల్లో చేపట్టిన 'గడపగడపకు కాంగ్రెస్'లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, బీఆర్‌ఎస్ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. నాయకులు కుసంబ్‌రావు, సుదర్శన్, గిడ్డప్ప, మారుతి ఉన్నారు.

గోడు వినేదెవరు?

కెరమెరి(ఆసిఫాబాద్): వారంతా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని 12 గ్రామాలకు చెందిన రైతులు.. రెండు ప్రభుత్వాల పాలనలోనూ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకీడుస్తున్నారు. అనాదిగా వారు సాగు చేసుకుంటున్న భూములకు ఏ ప్రభుత్వం పట్టాలు అందించలేకపోయింది. దీంతో వారు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం అటవీ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలిస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇటీవల సర్వే చేయించింది. 1930 నుంచి ఏదైన ఆధారం చూపాలని తిరకాసు పెట్టింది. చాలామంది రైతుల వద్ద అప్పటి ఆధారాలు లభించక ఆందోళన చెందుతున్నారు.



పరంధోళి గ్రామంలోని సాగుభూమి

- ఆందోళనలో 'సరిహద్దు' రైతులు
- ఎడతెగని 12 గ్రామాల వివాదం
- సాగుభూమికి అందని పట్టాలు
- ఆన్‌లైన్, ధరణి కల్పించిన చిక్కులు
- 2013 వరకు అందిన పహాణీలు
- ఆర్వోఆర్ పట్టాలపై రైతుల ఆశలు

2013 వరకు పహాణీలు

'సరిహద్దు' రైతులు సాగు చేస్తున్న భూమి అధిక భాగం ఫారెస్ట్‌కు చెందినది కాగా, కొంతభాగమే రెవెన్యూదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 1995 నుంచి 2013 వరకు ఆయా గ్రామాలకు చెందిన రైతులకు మాన్యువల్ పహాణీలు రెవెన్యూ అధికారులు ఇస్తూ వచ్చారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో పహాణీలు అందుబాటులోకి రావడంతో వీరికి అవి లభించలేదు. దీంతో రైతులు అప్పటినుంచి ఆందోళనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక, బ్యాంక్ రుణాలు దొరకక సాగు కోసం అవసరమైన పెట్టుబడి డబ్బుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయమై గతంలో పరంధోళికి చెందిన రైతులు పట్టాల కోసం మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రులను కలిశారు. ఇటీవల ఆయా గ్రామాలకు వెళ్లిన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి సమస్య వివరించారు. దీంతో ఆమె మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

ఆధారాలు దొరకడం కష్టమే..

అటవీ అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్వే చేసినప్పటికీ సరైన ఆధారాలు లభించలేదు. గిరిజనేతర రైతులు 1930 నుంచి అటవీ భూముల్లో సాగు చేస్తున్నట్లు, గిరిజనులు 2005 నుంచి సాగు చేస్తున్నట్లు ఆధారాలు చూపించాల్సి ఉంది. కానీ.. ఇంతవరకు చేసిన సర్వేల్లో గిరిజనేతరుల్లో 5శాతం రైతులకు కూడా దశాబ్దాల కిందటి ఆధారాలు లభించలేదు. అప్పటినుంచి ఉన్న వృద్ధుల వాంగ్మూలం, పురాతన బావులు, శ్మశానవాటికలు, ఆధార్ కార్డులు, ఓటరు ఐడీ కార్డులు, పురాతన కట్టడాలు తదితర 10 ఆధారాలు చూపించాల్సి ఉంది. గిరిజనులకు ఏదోలా అక్కడక్కడా లభిస్తున్నప్పటికీ.. గిరిజనేతరులకు అప్పటి ఆధారాలు లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైతే రేంజ్ సర్వేలు సాఫీగా కొనసాగుతున్నప్పటికీ పట్టాలు ఎందరికి వస్తాయో.. అన్న అనుమానాలు వారిలో ఉత్పన్నమవుతున్నాయి. పట్టాల విషయమై స్థానిక తహసీల్దార్ సాయన్నను వివరణ కోరగా.. హద్దులు గుర్తించేందుకు ఆయా గ్రామాలకు చెందిన మ్యాపులు లేవన్నారు. సరిహద్దు వివాదం తెగితే గాని ఆ గ్రామాల సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. ఈ విషయమై కొద్దిరోజుల క్రితం జిల్లా అధికారులు వివరాలు తెలుసుకున్నారని చెప్పారు.

18,374 ఎకరాల్లో సాగు..

సరిహద్దులోని వివాదాస్పద పరంధోళి, ముకదంగూడ, అంతాపూర్, భోలాపటార్ గ్రామ పంచాయతీల పరిధిలోని 12 గ్రామాలకు చెందిన 1,878 మంది రైతులు సుమారు 18,374 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో 476 మంది గిరిజనులు, 1,300 మంది ఎస్సీలు, 102 మంది బీసీలున్నారు. అనేక సంవత్సరాల నుంచి ఆయా గ్రామాల్లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతున్నారు. వీరందరి ప్రధాన వృత్తి వ్యవసాయమే.



సరిహద్దు పరంధోళి గ్రామం

కనీసం పహాణీలైనా ఇవ్వాలి



అటవీ భూములు సాగు చేస్తున్న మేము రాష్ట్ర ప్రభుత్వం అందించే పట్టాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. అప్పటివరకు అధికారులు కనీసం పహాణీలైనా ఇవ్వాలి. వాటితో బ్యాంకు రుణాలు పొందే అవకాశమైనా దక్కుతుంది.

– కాంబ్లె లక్ష్మణ్, రైతు, పరంధోళి

పథకాలు అందడంలేదు



పట్టాలు లేక ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను కోల్పోతున్నాం. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు కూడా అందడంలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఏళ్లనాటి మా సమస్య పరిష్కరించాలి.

– వాగ్మారే పుండ్లిక్, రైతు, పరంధోళి

సర్కారు స్థలానికి శఠగోపం!



ఆసిఫాబాద్‌కు చెందిన నేతకు గిఫ్ట్‌గా ఇచ్చిన భూమి ఇదే

సాక్షి, ఆసిఫాబాద్: ఖాళీ స్థలం కనిపించిందా.. అది ప్రభుత్వ స్థలమేనా.. అయితే ఒక బడా నాయకుడిని ఆశ్రయించడం.. కబ్జా చేసేయడం, ఆ తర్వాత ఏదో ఒకరీతిన పట్టాలు పుట్టించడం.. ఎంతోకొంత అధికారుల చేతిలో పెట్టడం.. వారిని లోబర్చుకుని వెంచర్లు వేయడం.. లేదా.. గంపగుత్తగా విక్రయించడం. ఇదీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న కబ్జాల బాగోతం.

- దర్జాగా సర్వే నంబర్ మార్పు
- 16.13 ఎకరాల భూమి కబ్జా
- ప్రభుత్వ భూమికి బందోబస్తు పట్టా
- తతంగం వెనుక అధికారపార్టీ నేత
- ప్రతిఫలంగా ఎకరం భూమి గిఫ్ట్
- దానిని రూ.1.25 కోట్లకు విక్రయం
- ధరావత్తు చెల్లించిన కెరమెరికి చెందిన నేత

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పాటుతో పట్టణంలోని భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక మంచిర్యాల–చంద్రాపూర్ జాతీయ రహదారి పనులతో జిల్లా ముఖచిత్రమే మారిపోయింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న భూముల విలువ పదింతలు పెరిగింది. ఫలితంగా ఈ రహదారి వెంట ఉన్న సర్కారీ భూములపై అక్రమార్కులు కన్నేశారు. ఏకంగా రికార్డులు తారుమారు చేసి ఆయా భూములను ఆక్రమించేసి వెంచర్లుగా చేసి విక్రయించేస్తున్నారు. తాజాగా ఆసిఫాబాద్ శివారులో 16.13 ఎకరాల లావాణి పట్టా భూమిని ఇద్దరు సోదరులు అధికార పార్టీ నేతలు, రెవెన్యూ అధికారుల అండదండలతో తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ అక్రమాలకు సహకరించిన అధికారపార్టీ నేతకు రూ.1.50 కోట్ల విలువైన ఎకరం భూమిని గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇప్పుడా భూమిని మరో నేత రూ.1.25 కోట్లకు కొనుగోలు చేయడం విశేషం. ఇప్పటికే కొంత మొత్తం ధరావత్తు చెల్లించినట్లు సమాచారం.

సర్కారు భూమికి ఎసరు పెట్టారిలా..

ఆసిఫాబాద్ పట్టణ శివారులో మంచిర్యాలకు వెళ్లే మార్గంలో హనుమాన్ టెంపుల్ నుంచి ఆదర్శ పాఠశాల నడుమ సర్వే నంబర్ 95లో సుమారు 77 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1954–55లో అప్పటి ప్రభుత్వం పోరంబోకు భూమిని బొయిరే బద్దు అనే వ్యక్తికి అసైన్డ్ చేసింది. ఆ తర్వాత లావుణి పట్టా ఇచ్చింది. అనంతరం బందోబస్తు పట్టాగా రూపాంతరం చెందింది. వంశపారంపర్యంగా వస్తున్న ఈ భూమిని బద్దు కుమారుడు సద్దు 2016లో పట్టణంలోని బాపునగర్‌కు చెందిన సులేమాన్ జివానీకి విక్రయించాడు. ఇక్కడే అసలు తంతు జరిగింది. అసైన్డ్ చేసిన భూముల క్రయవిక్రయాల జరగవని తెలిసి.. వారు 9 ఎకరాల సర్కారు భూమికి కేస్లాపూర్‌కు చెందిన సర్వేనంబర్ 9కి బై నంబర్లు వేసి పట్టాలు సృష్టించారు. అలాగే సులేమాన్ జివానీ సోదరుడు బర్కత్ జివానీ 95 సర్వే నంబర్‌లోని 7.1360 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే నంబర్ 10కి బై నంబర్లు వేసి సొంతం చేసుకున్నాడు. దాంతోపాటు పక్కనే ఉన్న ఎకరాకుపైగా స్థలాన్ని కూడా వీరు కబ్జా చేశారు.

రంగంలోకి స్థానిక నేత... గిఫ్ట్‌గా ఎకరం

ఈ తతంగం తెలిసి ఆసిఫాబాద్‌కు చెందిన అధికారపార్టీ నేత ఒకరు రంగంలోకి దిగాడు. సదరు అక్రమార్కులను తనదైనశైలిలో బెదిరించినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ భూమిని అక్రమంగా సొంతం చేసుకున్న వారు సదరు నేతకు తమ ఆక్రమణలో ఎకరం భూమిని గిఫ్ట్‌గా ఇచ్చేసినట్లు తెలుస్తోంది. అధికారులు ఇప్పుడా భూమికి కూడా పట్టా జారీ చేయడం గమనార్హం.

రూ.1.25 కోట్లకు బేరం

అసైన్డ్ భూమిని అప్పనంగా కాజేసిన అధికార పార్టీ నేత ఆ స్థలాన్ని ఇటీవల బేరానికి పెట్టగా కెరిమెరికి చెందిన అధికారపార్టీ నేత ఒకరు కొనుగోలుకు ముందుకువచ్చినట్లు సమాచారం. ఎకరం భూమిని రూ.1.25 కోట్లకు కొనేలా ఇరువురి మధ్య ఒప్పందం జరిగింది. ధరావత్తు కింద ఇప్పటికే రూ.లక్షల్లో ఆసిఫాబాద్‌కు చెందిన నేతకు చెల్లించినట్లు గుప్పుమంటోంది. త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తారని సమాచారం. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు పరాధీనమవుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టడం లేదు. అక్రమాల్లో వారి హస్తం ఉన్నందునే కనీస చర్యలకు ఉపక్రమించలేదనే ఆరోపణలు పట్టణ కేంద్రంలో వెల్లువెత్తుతున్నాయి.

మెరుగైన వైద్యమే లక్ష్యం

దహెగాం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి నూతన భవన నిర్మాణానికి రూ.1.15కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నాణ్యతతో సకాలంలో భవనాన్ని పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సులోచన, జెడ్పీటీసీ శ్రీరామారావు, తహసీల్దార్ మధుకర్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సీహెచ్‌వో మల్లికార్జున్, సర్పంచ్ లక్ష్మి, కృష్ణమూర్తి, నాయకులు సంతోష్‌గౌడ్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కృష్ణారావు

భక్తులకు వసతులు కల్పించాలి



రథోత్సవం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతరకు లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, క్యూలైన్లు, క్యూలైన్ల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులతో ఆలయ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. రథోత్సవం రోజు భక్తులు అధికసంఖ్యలో రానున్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రథోత్సవం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ సౌందర్య, ఎంపీటీసీ హరిత, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, చైర్మన్ వెంకటేశంచారి, ఈవో బాపిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మధునయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



ఆలయంలో శివలింగం



రథాన్ని లాగుతున్న భక్తులు

- బాలేశ్వరున్ని దర్శించుకున్న భక్తులు
- పెద్దవాగు నదీతీరంలో జాతర
- రథాన్ని లాగేందుకు భక్తుల ఆసక్తి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. అర్చకులు రవిచంద్ర శర్మ, శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూలైన్లలో నిలబడి బాలేశ్వరున్ని దర్శించుకున్నారు. జిల్లా కేంద్రంతోపాటు ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్, తిర్యాణి, వాంకిడి మండలాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి బాలేశ్వరున్ని దర్శించుకొని మొక్కు చెల్లించుకున్నారు.

ఘనంగా అన్నదానం

రథసప్తమి వేడుకల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో తాటిపెల్లి దిలీప్ మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగింది. నిర్వాహకులు చందూరి రమేశ్, భాస్కర్‌గౌడ్, సిద్దంశెట్టి ఉమేశ్, పోలంపెల్లి బాలేశ్వర్, మొండి తదితరులు పాల్గొన్నారు.

జాతర.. రథోత్సవం

ఏటా మాఘ శుద్ధ రథసప్తమి రోజు నిర్వహించినట్లే ఈసారి కూడా పెద్దవాగు నదీతీరంలో జాతర నిర్వహించారు. నదీ తీరంలో అధికసంఖ్యలో దుకాణాలు, స్టాళ్లు వెలిశాయి. సాయంత్రం ఆలయం నుంచి పెద్దవాగు మీదుగా నిర్వహించిన రథోత్సవంలో బాలేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉదయం ఆలయానికి చేరుకున్నారు. బాలేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గతేడాది ఆలయానికి మంజూరు చేసిన రూ.10 లక్షల సీసీ రోడ్డు ఇప్పటివరకు ప్రారంభించలేదని, ఆలయ అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని అర్చకులు బాలేశ్వరశర్మ ఎమ్మెల్యేను కోరారు. ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

క్రీడామైదానాన్ని ఇప్పించాలని రాస్తారోకో

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గతంలో ఉన్న క్రీడామైదానాన్ని ఖాళీ చేయించి ఇప్పించాలని జిల్లా కేంద్రంలోని క్రీడాకారులు, యువకులు కోరారు. జిల్లా కేంద్రంలో పోలీస్ హెడ్‌క్వార్టర్ కార్యాలయంగా కొనసాగుతున్న స్థలంలో జిల్లా ఏర్పాటుకు ముందు ఉన్న క్రీడా స్థలాన్ని తిరిగి క్రీడాకారులకు ఇప్పించాలని శనివారం జిల్లా కేంద్రంలోని రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న క్రీడామైదానం పట్టణానికి దూరంగా ఉందని, యువత కోసం గతంలో ఉన్న మైదానాన్ని అప్పగించాలని కోరారు.

క్లుప్తంగా

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



వివిధ రకాల వేషధారణలో అపరిచిత వ్యక్తులు

చెన్నూర్: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. చెన్నూర్ పట్టణంలో వివిధ రకాల వేషధారణలో తిరుగుతున్న ముగ్గురు వ్యక్తుల ఫొటోలను శనివారం పోలీస్ స్టేషన్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణాలకు అన్ని ప్రాంతాల వారు వచ్చి రకరకాల వ్యాపారం, యాచించడం లాంటి పనులు చేస్తుంటారని, కాలనీలలో తిరిగే సమయంలో అలాంటి వారి కదలికలపై ప్రజలు కన్నేసి ఉంచాలన్నారు. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

'పక్షం రోజుల్లో ఆక్షేపణలు తెలియజేయండి'

చెన్నూర్: చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలో అక్రమంగా కలప రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలపై అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామని, శాశ్వతంగా స్వాధీనం చేసుకునేందుకు ఆక్షేపణలు ఉంటే 15 రోజుల గడువులో డివిజనల్ కార్యాలయంలో తెలియజేయాలని చెన్నూర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి రేంజ్‌లలో శాశ్వతంగా స్వాధీనం చేసుకునే వాహనాల వివరాలు ప్రకటించారు. ఐచర్ వ్యాన్, మహేంద్ర జీప్, రెండు టాటా సుమోలు, ఆటో, మహేంద్రజీప్ డీఐ, బోలేరాలు ఉన్నాయని తెలిపారు. పక్షం రోజులలో ఎలాంటి ఆక్షేపణలు రాకుంటే సదరు వాహనాలను శాశ్వతంగా స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జైపూర్: మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన మెరుగు రాజేశం(85) శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామారావుపేట గ్రామానికి చెందిన రాజేశం బహిర్భూమి కోసం పెద్ద చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారీ చెరువులో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

వాంకిడి(ఆసిఫాబాద్): రోడ్డుపై కాలినడకన వెళ్తున్న ఓ వ్యక్తిని ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సునీల్ (45) కొంతకాలంగా సేల్స్ అండ్ కమర్షియల్ చెక్‌పోస్టులోపని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి కాలినడకన చెక్‌పోస్టు వద్దకు వెళ్తుండగా లక్ష్మీనగర్(పుకట్‌నగర్) సమీపంలోకి వెళ్లగానే ఇటన్‌కార్ నవీన్ అనే వ్యక్తి బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో సునీల్‌కు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నేరడిగొండ: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి కుప్టి–కుమారి మార్గంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం... మండలంలోని కుప్టి (కె) గ్రామానికి చెందిన రాజేశ్వర్ (54) ద్విచక్ర వాహనంపై కుప్టి వైపు నుంచి కుమారి వైపు వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొంది.

బాబోయ్.. దొంగలు

- జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఈ నెల 24న అర్ధరాత్రి నలుగురు దొంగల ముఠా రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించింది. ఓ ఇంట్లో చొరబడి 13 తులాల బంగారం, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లింది. మరో ఇంటిఎదుట పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని సైతం దొంగిలించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డులో శుక్రవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో దొంగలు పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగల గొట్టి 19 తులాల బంగారం, 33 తులాల వెండి, రూ.3వేల నగదు దొంగిలించారు.
- బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో గురువారం అర్ధరాత్రి పలు ఇళ్లలోకి చొరబడ్డారు. వారి చేతుల్లో పదునైన ఆయుధాలు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారిని చూసి కొంత మంది గ్రామస్తులు ఇండ్లలోకి వెళ్లారు. నలుగురు వ్యక్తులు గ్రామంలో తిరిగిన వీడియో సీసీ కెమెరాలో రికార్డయింది. ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు.
- ఆదిలాబాద్ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ఓ కానిస్టేబుల్ బైక్‌ను మూడు రోజుల క్రితం దొంగలించారు. విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరగా, తన వాహనాన్ని బస్టాండ్‌లో పార్కింగ్ చేశాడు.



బోథ్‌లోని పొచ్చెరలో రోడ్లపై సంచరిస్తున్న దొంగలు (ఫైల్)

- వరుస చోరీలతో అయోమయం
- ఆదిలాబాద్ జిల్లాలో వరుస చోరీలు
- జనాలను హడలెత్తిస్తున్న చెడ్డీ గ్యాంగ్?
- పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనలు
- తాజాగా ఇచ్చోడలోని రెండిళ్లలో చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ముఠా జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. పోలీసులకు సైతం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు అప్రమత్తమైనా ఆ ముఠా పట్టుబడడం లేదు. జైనథ్ మండలం దీపాయిగూడ, ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డు, బోథ్‌లోని పొచ్చెర, ఇచ్చోడలో వీరి ఆగడాలు మితిమీరాయి. తాళం వేసి ఉన్న ఇండ్లతో పాటు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ ముఠా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో చొరబడినట్లు పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

చెడ్డిగ్యాంగ్ పనేనా.?

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా చెడ్డి గ్యాంగా.? లేక ఇతర ఏ ముఠానా.. అని పోలీసులు ఆరా తీస్తున్నారు. జైనథ్, పొచ్చెరలో నలుగురు వ్యక్తులతో కూడిన ముఠా కాలనీలో సంచరిస్తుంతగా, ఆయా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బోథ్ మండలం పొచ్చెరలో నలుగురు వ్యక్తులు చేతుల్లో ఇనుప రాడ్లు, కత్తులతో గ్రామంలోని రోడ్లపై సంచరించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే ముఠా ఇచ్చోడలో సైతం దొంగతనానికి యత్నించి ఇంట్లోని వ్యక్తులను చూసి పరారయ్యారు. నాలుగైదు రోజులుగా ఏదో ఓ చోట దొంగతనానికి పాల్పడడంతో జనాలు భయాందోళనలకు గురవుతున్నారు.

పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు..

వరుస దొంగతనాలతో ప్రజలకు, పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. దొంగలను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహన తనిఖీలు సైతం చేపడుతున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వీరి ఆగడాలను నివారించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారి ఆగడాలను పోలీసులు అరికట్టలేకపోతున్నారు.



జైనథ్‌లోని ఓ ఇంట్లో పడేసిన వస్తువులు (ఫైల్)

అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి



జిల్లాలో ఎక్కడైనా అనుమానితులు సంచరిస్తే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్తే చుట్టూ పక్కల వారికి చెప్పి వెళ్లండి. విలువైన నగదు, బంగారం ఇంట్లో పెట్టి బయటకు వెళ్లొద్దు. జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ బయట వ్యక్తులుగా అనుమానిస్తున్నాం. 10 ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపడుతున్నాం. గ్రామాల్లో కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

బైక్ చోరీలు అధికమే..

జిల్లాలో బైక్ చోరీలు అధికంగానే జరుగుతున్నాయి. గతేడాది పోలీసుల లెక్కల ప్రకారం 47 ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు చెబుతుండగా, అనధికారికంగా వందల సంఖ్యలోనే ఉంటాయి. ఈ ఏడాది జనవరిలో ఇప్పటి వరకు అధికారికంగా నాలుగు వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయని వారు పదుల సంఖ్యలో ఉంటారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రిమ్స్ ప్రాంతంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఏడాది దాదాపు రూ.2 కోట్ల నగదు వరకు ఎత్తుకెళ్లగా ఈ ఏడాదిలో దాదాపు 30 తులాలకు పైగా బంగారం, రూ.లక్షలోపు నగదు దోచుకుపోయారు.

ఇచ్చోడలో చోరీకి యత్నం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్, సాయినగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. విద్యానగర్‌లోని ఇందారపు బాలకృష్ణ, సాయినగర్‌లోని తృప్తి గంగాధర్ ఇళ్లల్లో అర్ధరాత్రి ఇంటి డోర్‌లకు డ్రీల్ ద్వారా రంధ్రాలు చేసి ఇళ్లలోకి చొరబడ్డారు. చప్పుడు కావడంతో బాలకృష్ణ కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. పక్కనే ఉన్న సాయినగర్‌లోని గంగాధర్ ఇంట్లో చోరీకి యత్నించారు. వారు వెంటనే 100 డయల్‌కు కాల్ చేయడంతో పోలీసులు రావడాన్ని గమనించి పరారయ్యారు. శనివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సీఐ నైలు, ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భయాందోళనలకు గురికావద్దు....

ప్రజలు భయాందోళనలకు గురికావద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సాయంత్రం మండల పోలీస్‌స్టేషన్ సందర్శించి మాట్లాడారు. జిల్లా పోలీసు యంత్రాగం పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఉంటే వెంటనే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎస్పీ



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ నైలు

'బ్యాంకర్లు రైతుబంధు డబ్బులు ఇవ్వాలి'



మాట్లాడుతున్న ఖలెందర్ అలీఖాన్

జన్నారం: రైతుబంధు పథకం డబ్బులు బ్యాంకర్లు రైతులకు ఇవ్వాలని, పంట రుణాల రెన్యూవల్ పేరిట తీసుకోవడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలెందర్ అలీఖాన్ అన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెట్టుబడి లేక రోడ్డున పడుతున్నారని ఆరోపించారు. అప్రకటిత కరెంటు కోతలతో ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. పోడు సమస్యపై అధికారులు దృష్టి సారించాలని, అర్హులకు హక్కు పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 22న సీపీఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దాసరి తిరుపతి, కన్వీనర్ మామిడి విజయ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎంసీసీ భూమి స్వాధీనం చేసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎంసీసీ సిమెంటు పరిశ్రమకు కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో సిమెంట్ ఫ్యాక్టరీ కోసం గతంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్, ఇనాం, ప్రభుత్వ భూములు, పట్టాభూములను కేటాయించిందని తెలిపారు. ప్రస్తుతం కంపెనీ మూతపడిందని, యంత్రాలను అమ్ముకుంటోందని, భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం విక్రయించేందుకు సిద్ధపడ్డారని పేర్కొన్నారు. భూమిని స్వాధీనం చేసుకుని రైతులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్‌రావు, ఓబీసీ జిల్లా మాజీ అధ్యక్షుడు లింగన్నపేట విజయ్‌కుమార్, మంచిర్యాల పట్టణ ఉపాధ్యక్షుడు సోము ప్రదీప్‌చంద్ర, నాయకులు మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుకు సై..



కూరగాయలు, ఆకు కూరలు తెంపుతున్న కూలీలు

- సేంద్రియ ఎరువులతో కూరగాయలు, ఆకుకూరల సాగు
- వరించిన పుడమిపుత్ర అవార్డు
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు సతీశ్

చెన్నూర్‌రూరల్: రసాయనిక ఎరువులతో మనం తినే ఆహార పదార్థాలు విషతుల్యమవుతున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందించాలనే సంకల్పంతో మంచిర్యాల జిల్లాలో పలువురు రైతులు సేంద్రియ సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ కోవలోకి చెందిన వాడే చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన యువరైతు గోనె సతీశ్. 14ఏళ్లుగా సేంద్రియ ఎరువులతోనే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ లాభాలు గడిస్తున్నాడు.

ఆకుకూరలు, కూరగాయల సాగు...

తమ ఇంటి వద్ద ఉన్న ఎకరం స్థలంతో పాటు గ్రామంలో మరో మూడెకరాల వరకు భూమిని కౌలుకు తీసుకుని సుమారు 20రకాల కూరగాయలు సాగు చేస్తున్నాడు. వంకాయ, కాకర, బెండ, మిర్చి, టమాట, బీర, అల్చంత, చిక్కుడుకాయ, సోరకాయ, దొండకాయలతో పాటు తోటకూర, పాలకూర, గోంగూర, మెంతి, కొత్తిమీరు వంటి పంటలను సాగు చేస్తున్నాడు. వీటి సాగుకు సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగిస్తున్నాడు. ముఖ్యంగా జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం అనే సేంద్రియ ఎరువులను ఇంటి వద్దే తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుల తయారీకి ఆవు మూత్రం, ఆవు పేడ కోసం ఇంటి వద్దే పశువులను పెంచుతున్నారు. వేసవి కాలంలోనైతే కూరగాయలకు మరింత డిమాండ్ పెరుగుతుండడంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు.



సేంద్రియ ఎరువును కలుపుతున్న రైతు సతీశ్

సతీశ్ దంపతులకు పుడమి పుత్ర అవార్డు

14 ఏళ్లుగా సహజ సిద్ధమైన ఎరువులతో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేయడమే కాకుండా, సేంద్రియ ఎరువులను అవసరం ఉన్న రైతులకు అందిస్తున్నాడు. అంతే కాకుండా చెన్నూర్ పట్టణంలో కూరగాయల దుకాణాన్ని సైతం ఏర్పాటు చేశాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండిస్తూ పడమితల్లిని కాపాడుతున్నందుకు గాంధీ గ్లోబల్ సంస్థ వారు గత ఏడాది కర్నూల్‌లో రైతు సతీశ్, రజిత దంపతులకు పుడమి పుత్ర అవార్డును అందజేశారు.

నాలుగేళ్లుగా సాగు



సేంద్రియ ఎరువులను వాడుతూ నాలుగేళ్లుగా కూరగాయలను సాగు చేస్తున్నాను. రైతులు ఆవు పేడ, బెల్లం, శనగపిండితో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాను. జీవామృతం ఎరువు పంటలకు బాగా ఉపయోగపడుతుంది. ఇది ఇళ్ల వద్ద, పెరళ్లు, తోటలు, చేన్ల వద్ద నే తయారు చేసుకోవచ్చు. –డెబ్బ రామన్న, రైతు, ఎర్రగుంటపల్లి

సేంద్రియ ఎరువులు వాడుతున్నాను



సేంద్రియ ఎరువులను వాడి పంటలు సాగు చేస్తున్నాడు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచిస్తున్నాం. సేంద్రియ ఎరువులతో పెట్టుబడులు తక్కువగా ఉంటున్నాయి. మంచి దిగుబడులు వస్తున్నాయి.

– సతీశ్, రైతు, శివలింగాపూర్

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న టి.సాగర్

కోటపల్లి(చెన్నూర్): కాళేశ్వరం బ్యాక్ వాటర్ ముంపు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. శనివారం కొల్లూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పవని హెచ్చరించారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్, జిల్లా అధ్యక్షుడు సంకే రవి, మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి చందు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పున్నం ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో విలక్షణ తీర్పు

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 14 మందికి న్యాయమూర్తి ఉపనిషద్వని శనివారం విలక్షణమైన తీర్పునిచ్చారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన వారిని ట్రాఫిక్ సీఐ నరేష్ కుమార్ కోర్టులో హాజరుపర్చగా కేసు విచారించిన న్యాయమూర్తి 14 మంది మందు బాబులు రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు కేంద్రంలో పారిశుధ్య పనులు చేయాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు. అలా చేయనిపక్షంలో పది రోజులు సాధారణ జైలుశిక్ష విధించనున్నట్లు వెల్లడించారు.

పెట్రోల్ బంక్ సీజ్



పెట్రోల్ బంక్ సీజ్ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తోళ్లవాగు వద్ద గల రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో డీలర్ నిబంధనలు పాటించడం లేదని ఆ కంపెనీ సిబ్బంది శనివారం సీజ్ చేశారు. దీంతో డీలర్ సుధాకర్ వారిని అడ్డుకోవడంతో కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. సదరు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని గొడవను సద్దుమనిచారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బంది మాట్లాడుతూ బంక్‌లో నిబంధనలు పాటించాలని పలుమార్లు సూచించినప్పటికీ పట్టించుకోకపోవడంతోనే సీజ్ చేసినట్లు తెలిపారు.

వాహనం అదుపుతప్పి ఒకరు మృతి

కోటపల్లి(చెన్నూర్): వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన కోటపల్లి మండలంలోని లక్ష్మీపూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... అన్నారం గ్రామానికి చెందిన గొల్లగట్టు సమ్మయ్య (25) ఉదయం టమాటాలు అమ్మడానికి తన బొలెరో వాహనంలో సిరోంచకు బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన తాళ్ల రమేశ్, సయ్యద్‌బాబా, కొండపర్తి మహేశ్ వేర్వేరు పనుల నిమిత్తం సిరొంచకు వెళ్తూ అదే వాహనం ఎక్కారు. లక్ష్మీపూర్ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తాళ్ల రమేశ్, సయ్యద్‌బాబా, మహేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ సంఘటన స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెంకట్ తెలిపారు.



సమ్మయ్య మృతదేహం



సమ్మయ్య(ఫైల్)

బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

మందమర్రిరూరల్(చెన్నూర్): రాష్ట్రం, దేశానికి హాని చేసే పార్టీలను తరిమికొట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయానంద్ పిలుపునిచ్చారు. శనివారం మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సండ్రోనిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ వేల్పుల రవి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సంజీవరావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ గౌతమ్, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

సిర్పూర్(టి): గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై దీకొండ రమేశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ... మండలంలోని చీలపల్లి గ్రామ శివారులో నగపూరే పురుషోత్తం, చౌదరి పురుషోత్తం, వడ్డె ఉమాజీ, సెండే బాబాజీ గుప్తనిధుల కోసం శనివారం తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఆయన వెంట అదనపు ఎస్సై గుర్లే రాకేశ్ ఉన్నారు.



తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలి

పాతమంచిర్యాల: పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చార్వాక ట్రస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి మాట్లాడుతూ ఎలాంటి పారితోషికం, వేతనం లేకుండా ఎనిమిదేళ్లుగా పశుమిత్రలు ఉచిత సేవలు అందిస్తున్నారన్నారు. పశుమిత్రల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1న 'చలో హైదరాబాద్' నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీలత, కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా లావణ్య, ఉపాధ్యక్షులుగా మల్లిక, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా స్వప్న, నీరజ, సభ్యులుగా మంజుల, సరోజ, లక్ష్మి, సరిత, శ్రీలత, రాజేశ్వరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పశుమిత్రలు